జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం





## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 30 | మే | 2026 • పేజీలు : 7


# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 29,(ప్రజా జ్యోతి)** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ

మిగతా 2 లో...




5 లో..

# శవాలపై దందా...?

- కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ సేవలపై తీవ్ర ఆరోపణలు
- ఆర్.ఆర్. అంబులెన్స్‌నే పెట్టాలి అంటూ బాధిత కుటుంబాలపై ఒత్తిడి..?
- మార్చురి వద్దే బేరసారాలు.. ఇతర వాహనాలకు లేదు నోఎంట్రీ....?
- ఆసుపత్రి సిబ్బంది – ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకుల కుమ్మక్కుపై విమర్శలు

**కొత్తగూడెం, ప్రజాజ్యోతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతదేహాల తరలింపు వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు, అనారోగ్యాలతో కుటుంబ సభ్యులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలకు సహాయం చేయాల్సిన సమయంలో కొందరు వారి పరిస్థితిని ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్.ఆర్. అంబులెన్స్ సేవకే ప్రాధాన్యం ఇస్తున్నారని మృతదేహాలను తరలించేందుకు ఇతర వాహనాలను అనుమతించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబాలు తక్కువ ఖర్చుతో మరో వాహనం మాట్లాడుకున్నా ఆసుపత్రి పరిసరాల్లోకి రానివ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఆర్.ఆర్. అంబులెన్స్ మాత్రమే పెట్టాలి అంటూ ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇతర అంబులెన్స్ ఆసుపత్రి వెలుపలకు వస్తే ఆర్. ఆర్ సర్వీస్ నిర్వహుకుల హడావుడి అధికంగా ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక ప్రవేట్ వాహన సర్వీస్ నిర్వహుకుల పెత్తనం ఏమిటో అర్థం కానీ పరిస్థితి నెలకొంది.



## పల్లె దవాఖానా
# డాక్టర్ ఎక్కడ...?

రెండు నెలలుగా డాక్టర్ లేక హౌసింగ్ బోర్డ్ అంబేద్కర్ కాలనీ ప్రజల అవస్థలు

- అధికారులు నిర్లక్ష్యానికి రోగుల ప్రాణాలు బలవుతున్నాయా...?

**చుంచుపల్లి, మే 29 (ప్రజా జ్యోతి):** చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డ్ అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖాన ప్రస్తుతం వైద్య సేవలకు కాకుండా కేవలం భవనానికే పరిమితమైందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా దవాఖానలో డాక్టర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం తీవ్రత పెరిగి వైరల్ జ్వరాలు, దాహం, బీపీ, షుగర్, చిన్నపిల్లల అనారోగ్య సమస్యలు అధికమవుతున్న తరుణంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. "ఈరోజైనా డాక్టర్ వస్తారేమో" అన్న ఆశతో దవాఖానకు వచ్చే రోగులు నిరాశతో

మిగతా 2 లో...


## జూలూరుపాడు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అంకిత్

- వర్షాలకు తడవకుండా మొక్కజొన్న నిల్వలపై ప్రత్యేక పరిశీలన
- లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం



**కొత్తగూడెం, మే 29 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం జూలూరుపాడు కొనుగోలు కేంద్రంలో పరిశీలించారు. గత రాత్రి కురిసిన వర్షాల నేపథ్యంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న తడిసిందా

మిగతా 2 లో...






# రైతుల సమిష్ఠ కృషికి దక్కిన గౌరవం

- 2021-26సం. ఆయిల్ ఫామ్ సాగులో దేశంలోనే తొలి స్థానంలో తెలంగాణ
- జాతీయ వ్యవసాయ సదస్సులో ప్రకటించిన భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ కార్యదర్శి
- రైతు బాంధవుడిగా ఇది తుమ్మల విజయం

**భద్రాద్రికొత్తగూడెం ప్రతినిధి, మే 29, ప్రజాజ్యోతి :** ఆయిల్ ఫామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తోందని భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ కార్యదర్శి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరపున

మిగతా 2 లో...

## జూలూరుపాడు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అంకిత్



(మొదటి పేజీ తరువాయి...)

అనే అంశంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లతో పటిష్ట రక్షణ చర్యలు చేపట్టడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు కలెక్టర్కు వివరించారు. కేంద్రంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న బస్తాలను, వాటి నాణ్యతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం కేంద్రంలో 3,600 మొక్కజొన్న బస్తాలు ఉన్నాయని శుక్రవారం మొత్తం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 28 వేల బస్తాలను గోదాములకు తరలించినట్లు కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.. ముందురోజు ఎన్ని లారీలు లోడింగ్ చేశారో ఇప్పటివరకు ఎంత పరిమాణంలో మొక్కజొన్నను తరలించారో అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ శ్రీనివాస్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ఐడీఓసీ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, ఐ డి ఓ సి కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని , అదేవిధంగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని వివరించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి ఓటరును ఓటరు జాబితాలో చేర్చాలని అదే విధంగా అనర్హులైన ఓటర్లను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, పూసపాటి సాయి కృష్ణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమిష్ఠ కృషికి దక్కిన గౌరవం

(మొదటి పేజీ తరువాయి...)

2021-26 ఆయిల్ ఫామ్ మిషన్ రాష్ట్రాల వారీగా భౌతిక పురోగతిని జాతీయ వ్యవసాయ సదస్సులో వివరించారు. 2021-26 కాలంలో ఆయిల్ ఫామ్ సాగులో దేశంలోనే తొలి స్థానాన్ని తెలంగాణ సాధించిందని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 98,112 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుండగా, దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకెల్లా అత్యధిక విస్తీర్ణం తెలంగాణకే దక్కిందన్నారు.రాష్ట్ర రైతుల సమిష్ఠి కృషి, ప్రభుత్వ ప్రోత్సాహక చర్యల ఫలితంగానే ఈ విజయాన్ని సాధించినట్లు అధికారులు పేర్కొన్నారు.



**››› రికార్డు స్థాయిలో సాగు.. ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు**

ఇంత పెద్ద మొత్తంలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టడం ద్వారా రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునివ్వటమే కాకుండా గ్రామీణ ఆర్థిక ప్రగతికి సరికొత్త బాటలు వేసిందన్నారు. ఆయిల్ ఫామ్ సాగు రైతులకు లాభదాయక పంటగా మారిందన్నారు. భారతదేశం ప్రతి ఏటా భారీ మొత్తంలో విదేశాల నుంచి వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్న ఈ తరుణంలో వంట నూనెల దిగుమతులను తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో తెలంగాణ ఆయిల్ ఫామ్ రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. భద్రాద్రి కొత్తగూడెం సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రైతులు పెద్దఎత్తున ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావడంతో ఉత్పత్తి విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, నాణ్యమైన మొక్కలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం వల్లే ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.

**››› రైతు బాంధవుడిగా ఇది తుమ్మల విజయం..**

తెలంగాణ రాష్ట్రంలోని ఆయిల్ ఫామ్ విస్తరణలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మార్కు కనిపిస్తుంది. ప్రతి నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు అవసరమైన సలహాలను అందిస్తూ ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతు ఆర్థికంగా ఎలా నిలబడగలడో వివరిస్తూ రైతులను సాగు వైపు అడుగులు వేయించడంలో తుమ్మల గ్రాండ్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

- **సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మణ్**





**ములకలపల్లి, మే 29:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నేతలు డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ములకలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సంయుక్త మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్, సంయుక్త మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకులు, బస్, రైల్వే, విమాన చార్జీలు, ఆరోగ్యానికి సంబంధించిన మందులు, కిరాణా వస్తువులు, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, పురుగుమందుల ధరలు నిరంతరం పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. 'విశ్వగురువు' అంటూ చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం దేశీయ, విదేశీ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని, సాధారణ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంటే, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజల చేత తిరస్కరణకు గురవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బందారు నాగేంద్ర బాబు, ఎర్రగొర్ల రామారావు, ఒరుగంటి శ్రీను, ఊకే వెంకటేష్, సవల్ల శివ, బందారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానా డాక్టర్ ఎక్కడ...?

(మొదటి పేజీ తరువాయి...)

వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఇక్కడ మాత్రం డాక్టర్ లేక వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయని స్థానికులు మండిపడుతున్నారు. దవాఖానలో వైద్యుడు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల బాట పట్టాల్సి వస్తోందని, అక్కడ మందులు కొనలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ప్రత్యేకంగా రోజువారీ కూలీలు, పేద కుటుంబాలు చిన్న అనారోగ్యానికి కూడా వందల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ప్రభుత్వ దవాఖాన ఉన్నా ప్రయోజనం ఏమిటి..? డాక్టర్ లేకపోతే ప్రజలు ఎక్కడికి వెళ్లాలి..?" అని ప్రశ్నిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాలంటే అధికారులకు అంత నిర్లక్ష్యమా..? పేద ప్రజల ఆరోగ్య సమస్యలు పట్టించుకునే వారు లేరా..? అని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా డాక్టర్ లేకున్నా సంబంధిత వైద్య శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.పల్లె దవాఖానలో కనీసం తాత్కాలికంగా అయినా వైద్యుడిని నియమించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి పల్లె దవాఖానకు వెంటనే డాక్టర్‌ను నియమిస్తారా..? లేక ప్రజల ఆరోగ్యాన్ని ఇలా గాలికొదిలేస్తారా..? అన్న ప్రశ్నలు అంబేద్కర్ కాలనీలో వినిపిస్తున్నాయి.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

- **ఏడుగురు అదుపులోకి**
- **సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం**



**పాల్వంచ, మే 29, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం పాండురంగాపురం పరిధిలోని జామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాటలో పాల్గొంటున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే వారి వద్ద ఉన్న ఏడు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. పాల్వంచ మండల పరిధిలో అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ పోలీసులు హెచ్చరించినట్లు సమాచారం.

# రైతు పండించిన చివరి ధాన్యపు గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- మండే వీర హనుమంతరావు
- అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందొద్దని భరోసా



**సుజాతనగర్, మే 29 ( ప్రజాజ్యోతి )** రైతు పండించిన చివరి ధాన్యపు గింజ వరకూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం, సహకార సంఘం సిద్ధంగా ఉన్నాయి అని కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు అన్నారు. శుక్రవారం ఉదయం సుజాతనగర్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనే అంశంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరూ అధైర్యపడ వద్దని ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. అలాగే వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు కొత్తగూడెం సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 21,968 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.5 కోట్ల 20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రెండు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ద్వారా 5,380 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులపై వైద్య అధికారులకు అవగాహన శిక్షణ



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 29, (ప్రజాజ్యోతి)** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలోని పి హెచ్ సి, యు పి హెచ్ , యు ఎఫ్ డబ్ల్యు సి వైద్య అధికారులకు వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులపై అవగాహన , ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా పోలియో ,మీజిల్స్ వ్యాధుల లక్షణాలు, అనుమానిత కేసులను గుర్తించే విధానం, వెంటనే చేపట్టాల్సిన విచారణ , నమూనాల సేకరణ, ఫాలోఅప్ చర్యలు, వ్యాధి నియంత్రణ చర్యలు , నివేదికల సమర్పణ విధానాలపై సమగ్రంగా వివరించారు.జిల్లాలో వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల నిర్మూలన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి వైద్య అధికారి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్. ప్రతాప్, డా. రాజేష్, దినేష్, డా. హరీష్, జిల్లా పరిధిలోని అన్ని పి. హెచ్.సి, యూపీహెచ్సి , యు ఎఫ్ డబ్ల్యు సి లకు చెందిన వైద్య అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వీవోఏల ధర్నా




**టేకులపల్లి,మే29,ప్రజాజ్యోతి:**తెలంగాణ ఐకేపీ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు.సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీవోఏల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అర్హులైన వీవోఏలకు సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు టి. సునీత,కార్యదర్శి కె. రాజు, కోశాధికారి బి. మంగిలాల్, గౌసియా, స్వప్న, సుగుణ, కావేరి పాల్గొన్నారు.

## నేడు జ్ఞాన సాయిబాబా మందిర వార్షికోత్సవం

- పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు





**అశ్వారావుపేట, మే 29, ప్రజాజ్యోతి :** అశ్వారావుపేట, మే 29 ప్రజాజ్యోతి : పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో గల జ్ఞాన సాయిబాబా మందిరంలో నేడు 22వ వార్షికోత్సవ వేడుకలు శ్రీ షిరిడి సాయి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు, 200కేజీల పూలతో పుష్పాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు మధ్యాహ్న హారతి అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందాలని భజనలు, హారతులు, ప్రసాద వితరణ, సాయంత్రం బాబా వారికి పల్లకి సేవ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ షిరిడి సాయి సేవాసమితి సభ్యులు వెల్లడించారు.

## భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సమస్యలు పరిష్కరించాలి

- అడ్వాన్స్డ్ ట్రామా సెంటర్ ను భద్రాచలంలో ఏర్పాటు చేయాలి
- ఏరియా హాస్పిటల్ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో సర్వే



**భద్రాచలం టౌన్ , మే 29 , ప్రజాజ్యోతి** పేదోడి వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం బి నర్సారెడ్డి మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల కేంద్రంగా ఉన్న భద్రాచలం ఏరియా హాస్పిటల్ లో 42 మంది వైద్యులు అవసరం కాగా కేవలం 20 మంది మాత్రమే ఉన్నారన్నారు. అంతేకాకుండా ఇతర వైద్య సిబ్బంది సైతం లేక రోగులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిరోజు వచ్చే ఓపి పేషెంట్ల సంఖ్య సుమారు 400 వరకు ఉండగా చాలీచాలని సిబ్బందితో అంతమందికి వైద్య సేవలు అందించడం వైద్య బృందానికి కూడా సాధ్యం కావడం లేదన్నారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాచలం శాసనసభ్యులు స్వయాన వైద్యుడు అయినప్పటికీ ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షాల మిగిలిపోతుందని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రతినెల వేతనాలు అందక ఆకలితో పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, 20వ వార్డు సభ్యులు అనసూయ. పారిల్లి సంతోష్ కుమార్. డి సీతా లక్ష్మి నాదెండ్ల లీలావతి, ధనకొండ రాఘవయ్య, కనక శ్రీ పాల్గొన్నారు.

## వీల్ చైర్ వితరణ



**భద్రాచలం టౌన్ మే 29, జాజ్యోతి** భద్రాచలం పట్టణానికి చెందిన పిలక ధనలక్ష్మికి షుగర్ వ్యాధి కారణంగా కుడి కాలు మోకాలు కింది భాగం వరకు తీసివేసారు. ప్రస్తుతం ఉన్న వీల్ చైర్ పాతది కావడంతో తిరగడానికి ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న వస్త్ర వ్యాపారి నీలి దేవి ప్రసాద్ వీల్ చైర్ ను శుక్రవారం దేవస్థానం అధికారుల ద్వారా ఆమెకు తన స్నేహితులైన సాయిబాబా ఆలయ కమిటీ కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, సమాజ సేవకుడు కడాలి నాగరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ శ్రావణ్ కుమార్, సూపరింటెండెంట్ లు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలి

- సిపిఐ ( డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్ రెడ్డి



**మణుగూరు, మే 29 (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మణుగూరులో నిరసన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 15 నుంచి మే 25 వరకు 10 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచినందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు విడతలుగా పెట్రోల్ పై 7 రూపాయల 38 పైసలు, డీజిల్ పై 7 రూపాయల 52 పైసలు పెంచి పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజల పై మోయలేని భారాన్ని మోపుతున్నారని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన రవాణా చార్జీలు పెరిగి నిత్యావసర సరుకుల ధరలు, ఇతర ధరలు పెరిగి సామాన్యులు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెల్లా అశోక్, ఆకుల సత్యనారాయణ, పి.సంజీవరెడ్డి, వంశీకృష్ణ, సతీష్ బాబు, జంపయ్య, సుధాకర్, పివి శ్రీనివాస్, చెట్టుపల్లి నాగేశ్వరరావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ




**మణుగూరు, మే 29 (ప్రజాజ్యోతి):** వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించడానికి వాహనదారులకు, దారిన పోయే బాటసారులకు మరియు ఉపాధి హామీ కూలీలకు దాహార్తిని తీర్చడానికి వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మణుగూరు పట్టణంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి పైగా ఉచితంగా మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి శ్యామ్, వైస్ ప్రెసిడెంట్ కొల్లూరి గౌరీ శంకర్, కోశాధికారి సుగ్గల సూర్యం, ముఖ్యులు బందారు నర్సింహారావు, మోహన్ రావు, వనమా లక్ష్మీనారాయణ గుప్తా పాల్గొన్నారు.

## వ్యవసాయ వ్యర్థ పదార్థాలు కాల్చితే జరిమానా..!

- సూక్ష్మ క్రిములు సంపదను పెంచుకుందాం..



**టేకులపల్లి,మే29, ప్రజాజ్యోతి:** పంట పొలాల్లో వ్యవసాయం పదార్థాలు కాల్చే రైతుకు 5వేల నుంచి 25 వేల రూపాయలు జరిమానా విధించబడుతుందని ఏవో అన్నపూర్ణ పేర్కొన్నారు. టేకులపల్లి మండల దాసుతండ గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్. అన్నపూర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ వ్యర్ధపరదార్థాలను పంట పొలాల్లో కాల్చడం ఎంత నష్టము అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట కోత తర్వాత వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం ద్వారా కార్బన్ డయాక్సైడ్,నైట్రస్ ఆక్సైడ్, మీథేన్, క్లోరో ఫ్లోరో కార్బన్ వంటి విషవాయువులు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి అని అన్నారు. కార్బన్డయాక్సైడ్ సుమారు 120 సంవత్సరాలు,మీథేన్ వాయువు 20 సంవత్సరాలు వాతావరణంలో మిగిలిపోతున్నందున ఓజోన్ పొరను నాశనం చేస్తున్నాయి. అల్ట్రా వైలెట్ కిరణాలు విషపూరితమై వాతావరణా న్ని మనుషులను, జంతుజాలాన్ని నష్టం కలిగిస్తున్నాయి.వ్యవసాయ వ్యర్థ పదార్థాలు కాల్చడం వల్ల భూమిలో ఉన్నటువంటి సూక్ష్మ క్రిములు సంపదను నాశనం అవుతాయి.అలా వ్యర్థ పదార్థాలను కాల్చకుండ భూమిలోని సూక్ష్మజీవాలను వాటి సంపాదన కాపాడుకోవచ్చని అని అన్నారు. ఇలా చేయడం వల్ల పంట దిగుబడి తగ్గిపోకుండ చేయవచ్చు అని తెలిపారు. కాల్చడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయని రైతులకు ఏవో,సర్పంచ్, కార్యదర్శులు క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణి, విశాల, సర్పంచ్ చందర్ సింగ్, రైతులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న రాష్ట్ర హౌజింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్



**భద్రాచలం టౌన్ , మే 29 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర హౌజింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, వైదిక సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మూలవరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే లక్ష్మీతాయారు అమ్మవారిని, దాసాంజనేయస్వామిని ద ర్శించుకున్నారు. అనంతరం వీపీ గౌతమ్‌కు వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బం ది అందజేశారు. అలాగే వీపీ గౌతమ్ కుమారుడికి నామకరణం కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు, ఆల య పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు. కాగా వీపీ గౌతమ్ భద్రాచలం ఐటీడీఏ పీవోగా, ఖమ్మం కలెక్టర్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేసారు.

## వడదెబ్బకు వ్యక్తి మృతి



**బూర్గంపహాడ్, మే 29, (ప్రజా జ్యోతి):** వడదెబ్బకు వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మోరంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన యారం చిన్న సుబ్బారెడ్డి (46) వృత్తి రీత్యా తాపీ మేస్త్రి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం పనికి వెళ్ళివచ్చిన తరువాత ఎండవేడిమికి తట్టుకోలేక డీహైడ్రేషన్కు గురైంది. దీంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భద్రాచలం ఓ ప్రవేట్ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మరొక వైద్యశాలకి తరిలించనప్పటికి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎండతీవ్రతను తట్టుకోలేక ఇప్పటికే మండలంలో పలువురు వడదెబ్బకు మృతిచెందగా తాజాగా మోరంపల్లి బంజర చెందిన చిన్న సుబ్బారెడ్డి వడదెబ్బతో మృతిచెందడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి



**భద్రాచలం టౌన్, మే 29, ప్రజాజ్యోతి** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్– 2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్ నుండి ఐటీడీఏ పీవో బి.రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. బీఎల్ వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్ లైన్ లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని వివరించారు.పత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి ఓటరును ఓటరు జాబితాలో చేర్చాలని అదేవిధంగా అనర్హులైన ఓటర్లను తొలగించాలని ఆయన అన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



**చర్ల, మే 29 : (ప్రజాజ్యోతి ):** సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పి ఆర్ టి యు టి ఎస్ చర్ల మండల అధ్యక్షుడు ఎస్ఎ స్ఎస్ రవికుమార్ డిమాండ్ చేశా రు. నెలకు రూ.700 కోట్ల మేర పెం డింగ్ బిల్లులను చెల్లిస్తామని ప్రభు త్వం ప్రకటించినప్పటికీ, గత మూడు నెలలుగా బిల్లులు విడుదల కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు, ఉద్యోగులు అత్యవసర అవసరాల కోసం జెడ్పి జిపిఎఫ్ లోన్స్, టీఎస్ జీఎల్ఐ లోన్స్ తీసుకుని ఎదురు చూస్తున్నప్పటికీ, శాంక్షన్ అయి ఐ ఎఫ్ ఎం ఎస్ ద్వారా కుబేర్‌కు పంపిన బిల్లులు కూడా సంవత్సరం గడిచినా చెల్లించలేదన్నారు. అదేవిధంగా సరెండర్ లీవ్స్, పెండింగ్ సప్లిమెంటరీ బిల్లులు కూడా విడుదల కాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ నెలలోనైనా పెండింగ్ బిల్లులు చెల్లించి ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరా రు.ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సిహెచ్ . వేణుగోపాల్, బి. శ్రీనివాస్, ప్రధా న కార్యదర్శి వీరభద్రం, జిల్లా నాయకులు గురుమూర్తి, నాయకులు వీరమోహన్, పున్నం వెంకటరమణ, పలక నాగేశ్వరరావు, రామకృష్ణ, కాంతారావు, రమణయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



**చర్ల, మే 29 : (ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలోని సత్యనారాయణపురంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహకార సంఘం ద్వారా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకంలో భాగంగా జీలుగా, పిల్లి పెసర విత్తనాలను రైతులకు అందజేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ఉప్పులూరి జగదీష్, మందపాటి రవి, హరిచరణ్, పులిగుండల గోవిందరావు, కుదునూరు తాటి రామకృష్ణ తదితరులు విత్తనాలను కొనుగోలు చేశారు. రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు సరిపోవడం లేదని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు . ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు ఏడీఏతో మాట్లాడి సత్యనారాయణపురానికి మరో ఐదు టన్నుల జీలుగా విత్తనాలు పంపించాలని కోరారు. దీనిపై స్పందించిన ఏడీఏ రెండు మూడు రోజుల్లో అదనపు విత్తనాలు పంపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో లావణ్య, ఏఈఓలు రామకృష్ణ, వినీల, సంఘ ఉపాధ్యక్షులు ఆళ్ల నాగరాజు, సంఘ సభ్యులు ఎన్‌వీఎస్ వర్మ, సీతాపతి రాజు , సత్యనారాయణపురం సహకార సంఘ సీఈవో చిట్టిబాబు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ పోరుకేక సభను జయప్రదం చేయండి



**చర్ల, మే 29 (ప్రజాజ్యోతి ):** జూన్ 3న పాకాల కొత్తగూడలో నిర్వహించనున్న "ఆదివాసీ పోరుకేక" బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ సమాజానికి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం చర్ల మండలంలోని పలు ఆదివాసీ గ్రామాలు, గూడెల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.గుంజేడు ముసలమ్మ ప్రాంగణం (జూనియర్ కాలేజీ గ్రౌండ్లో) జరగనున్న ఈ సభలో ఆదివాసీల సమస్యలపై గళమెత్తనున్నట్లు నాయకులు తెలిపారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, లంబాడీల కారణంగా ఆదివాసీ యువతకు విద్యా సీట్లు, ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదని ఆరోపించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు సరైన సర్టిఫికెట్లు, ఉద్యోగాలు అందడం లేదని, ఐటిడిఏ వ్యవస్థ నిర్వీర్యమైందని విమర్శించారు. పీసా కమిటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, ఆదివాసీ ఉద్యోగులకు ప్రమోషన్లు లేక భవిష్యత్ భద్రత కరువైందని పేర్కొన్నారు.అదేవిధంగా పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదని, ఉన్న పట్టాలకు కూడా రక్షణ లేదని, గిరివికాస్ బోర్లు, ప్రత్యేక రాయితీలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గూడెం నుంచి పెద్దఎత్తున తరలివచ్చి పాకాల కొత్తగూడ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా దేవానగరం, దోసిల్లపల్లి, ఉయ్యాలమడుగు, తిప్పపురం, పెద్దమిడిసిలేరు, చిన్నమిడిసిలేరు, కలివేరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజుదొర, తుడుందెబ్బ చర్ల మండల అధ్యక్షుడు శ్యామల తరుణ్, జిల్లా ఉపాధ్యక్షుడు సోడి అనిల్‌కుమార్, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్‌రావు, కార్యకర్తలు కలం శ్రీను, పాయం శ్రీదేవి, తుర్రం శాంత, శ్యామల నీలవేణి, కారం అదేమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో బోర్ల తవ్వకాలకు శ్రీకారం



**చర్ల, మే 29 (ప్రజాజ్యోతి) :** చర్ల మండల ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ నిధులతో మంజూరైన బోర్ల తవ్వక పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన నిధుల నుంచి సుమారు రూ.12 లక్షలతో ఎనిమిది బోర్లను మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు.మొదటి విడతలో చర్ల మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీల్లో బోర్ల తవ్వకాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా కుదునూరు గ్రామంలో స్థానిక సర్పంచ్ కుంజ కమల, ఉప సర్పంచ్ సిద్ధి కిరణ్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం ఆర్.కొత్తగూడెం ఎస్సీ కాలనీలో సర్పంచ్ తుర్రం రవి, గొర్ల రాజబాబు, కూరపాటి వీర్రాజు బోర్ల పనులను ప్రారంభించారు. అలాగే తిప్పాపురం పంచాయతీలో కారం కన్నారావు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వేసవి కాలంలో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని బోర్ల మంజూరుకు సహకరించిన వద్దిరాజు రవిచంద్ర కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో–కన్వీనర్ అయినవోలు పవన్‌కుమార్, డివిజన్ నాయకులు నాతని రాము, యువజన నాయకులు కాకి అనిల్, తడికల బుల్లేబాయ్, స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.




# శవాలపై దందా..?

- కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ సేవలపై తీవ్ర ఆరోపణలు
- ఆర్.ఆర్. అంబులెన్స్‌నే పెట్టాలి అంటూ బాధిత కుటుంబాలపై ఒత్తిడి..?
- మార్చురి వద్దే బేరసారాలు.. ఇతర వాహనాలకు లేదు నోఎంట్రీ....?
- ఆసుపత్రి సిబ్బంది – ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకుల కుమ్మక్కుపై విమర్శలు

● కొత్తగూడెం, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతదేహాల తరలింపు వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు, అనారోగ్యాలతో కుటుంబ సభ్యులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలకు సహాయం చేయాల్సిన సమయంలో కొందరు వారి పరిస్థితిని ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్.ఆర్. అంబులెన్స్ సేవకే ప్రాధాన్యం ఇస్తున్నారని మృతదేహాలను తరలించేందుకు ఇతర వాహనాలను అనుమతించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబాలు తక్కువ ఖర్చుతో మరో వాహనం మాట్లాడుకున్నా ఆసుపత్రి పరిసరాల్లోకి రానివ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఆర్.ఆర్. అంబులెన్స్ మాత్రమే పెట్టాలి అంటూ ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇతర అంబులెన్స్ ఆసుపత్రి వెలుపలకు వస్తే ఆర్. ఆర్ సర్వీస్ నిర్వహకుల హడావుడి అధికంగా ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక ప్రవేట్ వాహన సర్వీస్ నిర్వహకుల పెత్తనం ఏమిటో అర్థం కానీ పరిస్థితి నెలకొంది.




### మార్చురి వద్దే బేరసారాలా..?

ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి గది వద్దనే ఆర్.ఆర్. అంబులెన్స్ సేవకు సంబంధించిన ఐస్‌బాక్స్‌లు, యాత్ర వాహనాలు సిద్ధంగా ఉంచుకుని... మృతుల కుటుంబాలతో బేరసారాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు ఏం చేయాలో తెలియని పరిస్థితిని ఆసరాగా చేసుకుని, కొందరు ఆసుపత్రి సిబ్బంది – ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు కలిసి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇతర అంబులెన్స్‌లు లేదా ప్రైవేట్ వాహనాలను ఆసుపత్రి వద్ద నిలవనివ్వడం లేదని మృతదేహాల తరలింపులో ఒకే సేవకు ప్రత్యేక ప్రాధాన్యం ఎందుకు ఇస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోనే ఒక ప్రైవేట్ అంబులెన్స్ సేవ నిరంతరం ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు.




### బాధిత కుటుంబాల బాధను వ్యాపారంగా మార్చొద్దు

ప్రాణం పోయిన ఇంట్లో కన్నీళ్లు ఆరకముందే డబ్బుల బేరసారాలు చేయడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను తరలించేందుకు వచ్చిన ఇతర వాహనాలను వెనక్కి పంపించిన ఘటనలు కూడా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బందిలో కొందరు అంబులెన్స్ నిర్వాహకులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారనే విమర్శలు పరిస్థితి తీవ్రతను బయటపెడుతున్నాయి. బాధిత కుటుంబాలకు స్వేచ్ఛగా తమకు నచ్చిన వాహనాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

### జిల్లా అధికారులు విచారణ చేపట్టాలి

ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు భరోసా కలిగించే స్థలం కావాలి గానీ దోపిడీకి కేంద్రంగా మారకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మృతదేహాల తరలింపులో పారదర్శక విధానం తీసుకురావాలని బాధిత కుటుంబాలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. మృతదేహల తరలింపు లో అధిక వసూళ్లకు పాల్పడుతున్న బాధ్యులపై, వారికి సహకరిస్తున్న ఆసుపత్రి సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## వివోఏల సమ్మెకు సిపిఐ(యం) సంఘీభావం

- రూ.20 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



**అన్నపురెడ్డిపల్లి, మే 29, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గత పది రోజులుగా కొనసాగుతున్న వివోఏల శాంతియుత నిరవధిక సమ్మెకు సిపిఐ(యం) సంఘీభావం తెలిపింది. శుక్రవారం సిపిఐ(యం) మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం సమ్మె శిబిరాన్ని సందర్శించి వివోఏలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించడంతో పాటు ఆరోగ్య, సాధారణ బీమా కింద రూ.20 లక్షల భద్రత కల్పించాలని కోరారు. అలాగే జీఓ నంబర్ 58ను సవరించి సెర్ప్ ద్వారా వివోఏలకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండుటెండల్లో కూడా తమ సమస్యల పరిష్కారం కోసం వివోఏలు పదిరోజులుగా నిరసన కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని జంగిలి వెంకటరత్నం అన్నారు. వివోఏల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివోఏల మండల అధ్యక్షురాలు తాగిర్స సుజా, ఉపాధ్యక్షురాలు కమల కుమారి, కార్యదర్శి సత్యనారాయణ, ఉప కార్యదర్శి నాగేశ్వరావు, కోశాధికారి కల్యాణి, ఉప కోశాధికారి అలీంబి, పుల్లూరు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి




**ఇల్లందు, మే 29, ప్రజాజ్యోతి:** గిరిజన ఎమ్మెల్యే కోరం కనకయ్య, అతని కుటుంబసభ్యులపై దుష్ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడుభోళ్ల సూర్యం అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పై దుష్ప్రచారం, అసత్య ఆరోపణలు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భోళ్ల సూర్యం మాట్లాడుతూ గిరిజన ఎమ్మెల్యే ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సహించబోమని హెచ్చరించారు. గిరిజన ఎమ్మెల్యే కోరం కనకయ్య గౌరవాన్ని దెబ్బతీసేలా వారి కుటుంబ సభ్యులపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తూ సామాజికంగా, రాజకీయంగా అవమానించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు సిలువేలు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్ కే చాంద్ పాషా, గిన్నారపు రాజేష్, సత్తాల హరీష్ తదితరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు క్రిమినల్ చట్టాల ప్రకారం వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక గిరిజన ప్రజా ప్రతినిధి ఎదుగుదలను జీర్ణించుకోలేక కుట్రపూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడం అత్యంత బాధాకరమన్నారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు, ఆరోపణలు ఏ రూపంలో వచ్చినా కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ప్రచారాలకు పాల్పడడం బిఆర్ఎస్ నాయకుల దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి చర్యలు వెంటనే ఆపకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, గిరిజన సమాజాన్ని అవమానించే వారిపై చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ జాఫర్ పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల కోసం జూన్ 2న సింగరేణి ఎదుట మహా ధర్నా



**పాల్వంచ, మే 29, ప్రజాజ్యోతి:** పాల్వంచలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పి ఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కుశ నాయక్ మాట్లాడుతూ, జూన్ 2, 2026న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాను జిల్లాలోని ప్రజలంతా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి నిధులతో జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని సింగరేణి సంస్థలో 1997 సమతా జడ్జిమెంట్, 1996 పీసా చట్టం ప్రకారం గిరిజనులకు ఉద్యోగాలలో 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సింగరేణి అండర్‌గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశించినప్పటికీ, ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులను నియమించడం వల్ల స్థానిక నిరుద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్థానికులతోనే ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో కాంట్రాక్టులు పొందిన కంపెనీల్లో కూడా సమతా జడ్జిమెంట్ ప్రకారం గిరిజనులకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అలాగే సెక్యూరిటీ ఏజెన్సీల లైసెన్సులను భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్, 1/70 చట్టం, పీసా చట్టం మేరకు గిరిజనులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో బాంబ్ బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు పగుళ్లు రావడం, పర్యావరణ కాలుష్యం, చెరువులు ఎండిపోవడం, వ్యవసాయ భూములు బీడుభూములుగా మారడం, రైతులు జీవనోపాధి కోల్పోవడం వంటి తీవ్ర నష్టాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బ్లాస్టింగ్ విధానాన్ని నిలిపివేసి యంత్రాలతో బొగ్గు తవ్వకాలు చేపట్టాలని, ఓపెన్‌కాస్ట్‌ల కంటే భూగర్భ గనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జిల్లాలోని సింగరేణి ఉత్పత్తిలో 43 శాతం ఏజెన్సీ ప్రాంత గనుల నుంచే వస్తోందని, అందుకు అనుగుణంగా CSR నిధుల్లో 43 శాతం గిరిజన గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుమ్మడి వెంకటేశ్వర్లు, భూక్య కృష్ణవేణి, బానోత్ లలిత, సుధాకర్, మహేష్, రామకృష్ణ, రాజేష్, ఉలవలపూడి రాములు తదితరులు పాల్గొన్నారు.

# చిక్కుడుగుంట గ్రామాన్ని అభివృద్ధి చేయండి


- **ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సిపిఐ, కాంగ్రెస్ నాయకులు**



**మణుగూరు, మే 29 (ప్రజాజ్యోతి):** చిక్కుడుగుంట గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సిపిఐ పార్టీ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిక్కుడు గుంట మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు మాట్లాడుతూ... గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలైన అంతర్గత రోడ్లు, సైడ్ కాలువలు, సైడ్ డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, చిక్కుడుగుంట గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని అంతేకాకుండా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సిపిఐ, కాంగ్రెస్ నాయకులు మాజీ మాజీ సర్పంచ్ కుర్సా రాంబాబు, మేడ వెంకటేశ్వర్లు, మేడ రామారావు, తంత్రపల్లి శోభన్, అలవాల సత్యం, బత్తరామరావు, మునిగేల లక్ష్మణ, గుమ్మల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# పాల్వంచ మండలం తోగ్గూడేం గ్రామంలో మైనింగ్ మాఫియా





- **అనుమతులు ఆవగింజంత, అక్రమణ ఆకాశమంత**

**కొత్తగూడెం కలెక్టరేట్ /పాల్వంచ ,మే 29, ప్రజాజ్యోతి:** ఆ గ్రామం మైనింగ్ మాఫియా జిల్లాకే తలమానికం అక్కడ ఆ మైనింగ్ యజమానులు చెప్పిందే వేదం వారు చేసేదే శాసనంగా నడుస్తుంది. కేజిఎఫ్ సినిమాను తలదన్నేలా అక్కడ అక్రమ మైనింగ్ నడుస్తుంది అంటే అక్కడ మైనింగ్ అక్రమం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా అటువైపు కన్నెత్తి చూడాలన్న ఆ ప్రాంతానికి వెళ్లాలన్న అడుగడుగునా నిఘా ఉంటుంది. క్షణాలలో అక్రమ నిర్వాహకులకు సమాచారం అందిస్తుంటారు. అక్కడ జరుగుతున్న బ్లాస్టింగులకు తీవ్ర పొల్యూషన్ ఏర్పడి గుండె సంబంధిత, కిడ్నీ , శ్వాసకోస, అంతు పట్టని వ్యాధులతో ప్రాణాలు గాలిలో దీపంలా ఆరిపోతున్న సమిధలు ఎన్నో మరి కొందరు అనారోగ్యపాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని సమాచారం, భూగర్భ జలాలు సైతం పేలుళ్ల శబ్దాలకు నివాసాలు నెర్రలు భారీ వాటి నుంచి వచ్చే పొల్యూషన్ కు ఈ ప్రాంతం కలుషితం అవుతున్నాయని ఆరోపణలు లేకపోలేదు. ఇంతటి మైనింగ్ మాఫియాను అడ్డుకునే ఆ శాఖ అధికారులు మాత్రం నివారించడంలో విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి, భద్రాద్రి జిల్లాలో సాగుతున్న మైనింగ్ మాఫియా వివరాల్లోకి వెళితే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ




మండలం తోగ్గూడెం గ్రామ పంచాయతీలోని మైనింగ్ మాఫియా కాసుల వేట సాగిస్తోంది. పగలు నిర్మానుష్యంగా ఉంటుంది, చీకటి పడితే పేలుళ్ల శబ్దాలు మారుమోగుతుంటాయి ,ఇక్కడ క్వారీల లీజు గడువు ముగిసి ఏళ్లు గడు స్తున్న యంత్రాల మోత ఆగట్లేదు. నిబంధనలను పలువురు తుంగలో తొక్కుతూ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండానే భారీ యంత్రాలతో కొండలను పిండిచేస్తున్నారు.

అనుమతి ఆవగింజంత అక్రమం ఆకాశమంత అన్న చందంగా మైనింగ్ దందా కొనసాగుతుందని పాల్వంచకు చెందిన చెందిన పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు,

తోగ్గూడెం గ్రామంలోని తొమ్మిది క్వారీల్లోనూ మైనింగ్ కార్యకలాపాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. రెండింటికి ఉన్న అనుమతులను ఆసరాగా చేసుకుంటున్న అక్రమార్కులు. మిగతా క్వారీల్లోనూ మైనింగ్ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు సమాచారం, మైనింగ్ అధికారులు కందకాలు తవ్వించినా కంకరను అక్రమంగా కొల్లగొట్టకుండా అడ్డు కోలేకపోతున్నారు. వాస్తవానికి గిరిజనులే ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో గిరిజనేతర బినామీలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం,

మైనింగ్ అక్రమం హద్దులు దాటడంతో ఆ శాఖ అధికారులకు అక్రమంగా మైనింగ్ చేస్తున్న వారికి మధ్య మంచినీళ్లకు – మ్యాన్షన్ హౌస్ కు ఉన్న అనుబంధం అని కూడా స్థానికుల నుండి ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాలలో మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు సమాచారం , క్వారీలకు ప్రభుత్వం రెన్యువల్ చేసుకునే అవకాశమివ్వటం లేదు. డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ (డీజీపీఎస్) సర్వే ప్రకారం.. ఇక్కడ గతంలో నిర్వహించిన క్వారీల సరిహద్దులు సరిపోలటం లేదు. అందుకే పర్యావరణ అనుమతులు రావట్లేదని సమాచారం. క్వారీ నిర్వాహకులు ఎన్నిసార్లు రెన్యువలు ధరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకుండా పోతుంది. రాజకీయ పలుకుబడితో మైనింగ్ మాఫియాను నడిపిస్తున్నారనీ దీనికితోడు ఇక్కడి నుంచి వెళ్లే కంకరను ప్రభుత్వ అభివృద్ధి పనులకే వాడుతున్నారని.. సర్కారు ఖజానాకు సీనరేజ్ రూపంలో ఆదాయం సమకూరుతున్నట్లు సంబందిత అదికారులు చెబుతున్నా.. వాటికి లెక్కాపత్రం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**››› ఇక్కడంతా.. ఇష్టారాజ్యం**

క్రషర్ మిల్లుల నిర్వహణకు ప్రభుత్వం ఇటీవల నూతన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. స్టోన్ క్రషర్లో విద్యుత్తు వినియోగం ఆధారంగా ఖనిజ ఉత్పత్తిని అంచనా వేస్తుంది. విద్యుత్తు వినియోగ సమాచారం విద్యుత్తు సంస్థలోని పోర్టలు అనుసంధానమవుతుంది. క్వారీల్లో వినియోగించే విద్యుత్తు ఆధారంగా పన్నులను సర్కారు వసూలు చేస్తుంది. దీనికి తోడు క్వారీల్లో సీసీ కెమెరాలు, వేబ్రిడ్జి ఏర్పాటుచేయాలని సూచించింది. సీసీ కెమెరాలను మైనింగ్ శాఖ కార్యాలయానికి అనుసంధానం చేయాల్సి ఉంది. అయితే ఇవేవీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి, కొత్తగా మరో మూడు క్వారీలకు అనుమతుల కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకోగా స్థానిక తహసిల్దార్ పై అధికారులకు పంపినట్లు సమాచారం

# రైతాంగ సమస్యలపై కేంద్రం వెంటనే స్పందించాలి

- **వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడమే మోడీ ప్రభుత్వ ధ్యేయం : సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నేత గౌని నాగేశ్వరరావు**






**పాల్వంచ, మే 29, ప్రజాజ్యోతి:** వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పగించడమే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు విమర్శించారు. పాల్వంచ మండలంలోని రెడ్డిగూడెంలో శుక్రవారం కళింగ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్నే ప్రధాన లక్ష్యంగా చేసుకుని నిర్వీర్యం చేసే విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. రైతుల హక్కులను బలహీనపరుస్తూ, వ్యవసాయ రంగంలో కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొస్తోందన్నారు. దేశంలో రైతులు ఏ పంటలు పండించాలి, ఎంత మేర సాగు చేయాలి అన్న విషయాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం విదేశీ విధానాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ రైతులపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికే రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, పండించిన పంటలు వర్షాలకు తడిసి మార్కెట్ లో అమ్ముడుపోక దళారీలకు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం, గిట్టుబాటు ధర కల్పించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముందు కందాల బుచ్చిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించగా, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కార్యదర్శి నివేదికను కామ్రేడ్ ఉప్పరబోయిన రామ్మూర్తి ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఉప్పరబోయిన రామ్మూర్తి, కళింగ రెడ్డి, కందాల బుచ్చిరెడ్డి, బత్తుల నాగరాజు, కొమరం మల్లేష్, తూము రాజయ్య, ముత్తమ్మ, మణెమ్మ, అంజలి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# యానాంబైలులో దళితుల ఇనాం భూములపై ‘100 ఏళ్ల లీజు’ మోసం?

- కబ్జా చేసి అక్రమ లేఅవుట్లు... ఫ్లాట్ల దందాతో కోట్ల వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలు
- వెంటనే విచారణ జరిపి అసలు లబ్ధిదారులకు న్యాయం చేయాలని దళిత సంఘాల డిమాండ్.
- జిల్లా కలెక్టర్ ప్రత్యేక విచారణ జరిపించాలి.
- ఇటీవల జరిగిన లీజు, అమ్మకాలపై సమగ్ర పరిశీలన చేపట్టాలి.
- కబ్జా ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
- ప్రతి దళిత రైతు భూమికి రీసర్వే చేసి హద్దు రాళ్లు పాతాలి.
- భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా నిషేధిత జాబితాలో చేర్చాలి.





**పాల్వంచ, మే 29, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం యానాంబైలు గ్రామపంచాయతీ పరిధిలో దళితులకు వెట్టిచాకిరీ విముక్తి కింద ప్రభుత్వం కేటాయించిన ఇనాం పట్టా భూములపై భారీ అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. “100 ఏళ్ల లీజు” పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి, అసైన్డ్ భూములను కబ్జా చేసి, ప్రస్తుతం లేఅవుట్లు వేసి ఫ్లాట్లుగా విక్రయిస్తూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారంటూ బాధిత కుటుంబాలు, దళిత సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం ఇచ్చిన భూములు నిజాం పాలనలో భూమిలేని మాదిగ, మాల తదితర ఎస్సీ వర్గాల వారు దొరల ఇళ్లలో, పొలాల్లో వెట్టిచాకిరీ చేసేవారని, అనంతరం వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జీవనాధారం కోసం ప్రభుత్వమే డి ఫారం అసైన్డ్ భూములను కేటాయించిందని, ఇవి విక్రయించరాదు, లీజుకు ఇవ్వరాదు, తాకట్టు పెట్టరాదని, కుటుంబ వారసులకు మాత్రమే చెందాల్సిన భూములుగా స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. యానాంబైలు పంచాయతీలో 1978 నుంచి 1980 మధ్యకాలంలో సుమారు 120ఎకరాల ఇనాం భూములను 65 దళిత కుటుంబాలకు పంపిణీ చేసినట్లు రెవెన్యూ రికార్డులు సూచిస్తున్నాయని బాధితులు చెబుతున్నారు.

### 100 ఏళ్ల లీజు’ పేరుతో మోసం ఎలా..?

బాధితుల కథనం ప్రకారం, చదువురాని వృద్ధ దళితులను “మీ భూమిలో బోరు వేస్తాం, పంటలో వాటా ఇస్తాం” అంటూ నమ్మించి తెల్ల కాగితాలపై వేలిముద్రలు తీసుకున్నారని, అనంతరం వాటినే “100 సంవత్సరాల లీజు” ఒప్పందాలుగా మార్చి, తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపిస్తున్నారు.

తర్వాత ఆ పత్రాల ఆధారంగా రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డులు మార్పించుకునే ప్రయత్నాలు జరిగాయని, ప్రస్తుతం భూములను చదును చేసి వెంచర్ రోడ్లు వేస్తూ ఫ్లాట్ల విక్రయాలు ప్రారంభించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యానంబైలు నుండి పాల్వంచ రహదారికి సమీపంలో ఉండటంతో భూముల విలువ భారీగా పెరగడంతో ఈ అక్రమాల వెనుక పెద్ద ఎత్తున లాభదోపిడీ జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### బాధిత కుటుంబాల ఆవేదన

యానాంబైలు గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు తమ పూర్వీకులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లోకి వెళ్లనివ్వడం లేదని, పాస్‌బుక్లు తమ పేర్లలో ఉన్నా భూమి మాత్రం ఇతరుల ఆధీనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాయి.

### చట్టం ప్రకారం ఇది నేరమేనంటున్న దళిత సంఘాలు

దళిత సంఘాలు తెలిపినదాని ప్రకారం అసైన్డ్ భూములను లీజుకు ఇవ్వడం, తీసుకోవడం చట్టవిరుద్ధమని, తప్పుడు పత్రాలతో ఆక్రమించడం ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు ఇతర క్రిమినల్ నిబంధనల ప్రకారమూ శిక్షార్హమేనని పేర్కొంటున్నారు.

### ఇది భూమి సమస్య కాదు... బతుకు సమస్య

దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన చిన్నచిన్న భూములే వారి జీవనాధారం, ఆత్మగౌరవానికి ప్రతీక. అలాంటి భూములపై అక్రమాలు జరిగితే కుటుంబాలు మళ్లీ ఆర్థికంగా దెబ్బ తింటాయని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. దళిత బంధు కంటే ముందు దళితుడి భూమిని కాపాడాలి. కబ్జా అయిన ఇనాం భూములు తిరిగి అప్పగించాలి. లేకపోతే యానాంబైలు నుంచే పెద్ద ఎత్తున భూమి పోరాటం ప్రారంభమవుతుంది అని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

యానాంబైలు గ్రామపంచాయతీ పరిధిలో దళితులకు ప్రభుత్వం కేటాయించిన ఇనాం భూములపై వస్తున్న ఆక్రమణలు, అక్రమ లీజుల ఆరోపణలపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీపీఎస్) తీవ్రంగా ఖండిస్తుంది. వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన దళిత కుటుంబాలకు జీవనాధారం కోసం ప్రభుత్వం కేటాయించిన భూములు కేవలం ఆస్తి మాత్రమే కాదు, వారి ఆత్మగౌరవానికి ప్రతీక అలాంటి భూములను “100 ఏళ్ల లీజు” పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించడం అత్యంత దుర్మార్గం. యానాంబైలు ప్రాంతంలో దళితుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని భూములను కాజేయాలని చూస్తున్న వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. దళిత కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం. దళితులకు చెందిన ఒక్క సెంటు భూమిని కూడా అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నించినా సహించేది లేదు. జిల్లా కలెక్టర్ వెంటనే ప్రత్యేక విచారణకు ఆదేశించి భూముల అసలు యజమానులకు న్యాయం చేయాలి. అసైన్డ్ భూములపై జరుగుతున్న అక్రమాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైతే గ్రామస్థులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి, నిరసన కార్యక్రమాలు వేపడుతాం. దళితుడి భూమి అంటే దళితుడి బతుకు... దాని జోలికొస్తే ఎమ్మార్పీఎస్ ఊరుకోదు.



**అల్లూరి సాంబశివ రావు**
ఎంఆర్పీఎస్ తెలంగాణ రాష్ట్ర మీడియా కమ్యూనికేషన్స్ అధ్యక్షులు.

# క్షణికావేశం.. జీవితం శూన్యం...

- జీవితం అమూల్యం.. ఆత్మహత్య అగాథం..
- ధైర్యమే కవచం.. ప్రాణమే సర్వస్వం..
- సమస్యలు తాత్కాలికం..

**చర్ల, మే 29:(ప్రజా జ్యోతి):** నేటి సమాజంలో రోజురోజుకీ పెరుగుతున్న ఆత్మహత్యల ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు తీవ్రమైన ఆర్థిక నష్టాలు, ప్రాణాంతక అనారోగ్యాలు, కుటుంబ విపత్తులు వంటి పెద్ద సమస్యల కారణంగా మాత్రమే ఇలాంటి విషాదాలు చోటుచేసుకునేవి. కానీ ప్రస్తుతం చిన్న చిన్న కారణాలకే జీవితాలను ముగించుకునే పరిస్థితులు పెరుగుతున్నాయని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చర్ల మండలంలో ఇటీవల చోటుచేసుకున్న ఆత్మహత్యల ఘటనలు కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగులుస్తున్నాయి. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు ఎన్నో కుటుంబాల్లో శాశ్వతమైన దుఃఖాన్ని మిగులుస్తున్నాయని సామాజికవేత్తలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం యువత నుంచి మధ్యవయస్కుల వరకు ప్రతి వర్గంలోనూ మానసిక ఒత్తిడి పెరుగుతోంది. పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం, ఉద్యోగం రాకపోవడం, ప్రేమ విఫలం కావడం, కుటుంబ కలహాలు, అప్పుల భారం, వ్యాపార నష్టాలు, సోషల్ మీడియా విమర్శలు వంటి కారణాలతో చాలా మంది తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.ముఖ్యం గా యువతలో సహనశక్తి తగ్గిపోవడం, సమస్యలను ఒంటరిగా మోసుకోవడం, తమ భావాలను ఎవరికీ చెప్పుకోకపోవడం ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సమస్యలను పంచుకునే సంస్కృతి ఉండేదని, కానీ ఇప్పుడు చాలామంది తమ ప్రపంచాన్ని మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకే పరిమితం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సోషల్ మీడియా ప్రభావం కూడా యువతపై తీవ్రంగా పడుతోందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికల్లో ఇతరుల జీవితాలను చూసి తమ జీవితాలతో పోల్చుకోవడం వల్ల నిరాశ, అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటున్నారు. “అతనికి అంత ఉంది..నాకు ఎందుకు లేదు?” అనే భావన కొందరిలో నిస్పృహను పెంచుతోందని అంటున్నారు.ఆర్థిక పరిస్థితులు కూడా అనేక కుటుంబాలను ఒత్తిడిలోకి నెడుతున్నాయి. పెరుగుతున్న ఖర్చులు, ఉద్యోగ భద్రత లేకపోవడం, అప్పుల భారాలు, పంట నష్టాలు చాలామందిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు తమ తమ సమస్యలతో మానసికంగా అలసిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మానసిక వైద్యుల అభిప్రాయం ప్రకా రం ఆత్మహత్యకు ప్రయత్నించే ముం దు చాలా మంది తీవ్రమైన ఒంటరితనం, నిరాశతో బాధపడుతుంటారు. అలాంటి సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు కాస్త శ్రద్ధ చూపించి వారితో మాట్లాడితే ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని చెబుతున్నారు.



“ఒక మంచి మాట.. ఒక ధైర్యం చెప్పే చేయి.. ఒక ఆప్యాయత చూపే మనసు చాలాసార్లు ఒక ప్రాణాన్ని కాపాడగలదు” అని నిపుణులు సూచిస్తున్నారు. ఆత్మహత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు, కుటుంబ సభ్యులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని సూచిస్తున్నారు.అలాగే ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారి భావాలను అర్థం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబంలో ప్రేమ, అనుబంధం, భరోసా ఉంటే చాలామంది మానసికంగా బలంగా నిలబడగలరని అభిప్రాయపడుతున్నారు. “జీవితం అనేది దేవుడు ఇచ్చిన అమూల్యమైన వరం. సమస్యలు జీవితంలో భాగమే కానీ అవే జీవితం కావు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటేనే నిజమైన విజయం సాధించగలం. క్షణికావేశంలో జీవితాన్ని వదులుకోవడం కాదు.. సమస్యలను జయించి ముందుకు సాగడమే నిజమైన ధైర్యం” అని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిస్తేనే ఇలాంటి విషాద ఘటనలను తగ్గించగలమని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. జీవితం ఓటములతో ఆగిపోదు ఆశతో ముందడుగు వేస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. “ప్రాణం పోతే తిరిగి రాదు..కానీ సమస్యలకు మాత్రం ఎప్పుడూ పరిష్కారం ఉంటుంది” అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

**– టి. రాజేష్ కుమార్**
చర్ల మండల ప్రజా జ్యోతి రిపోర్టర్